ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం
జిల్లా వార్తలు
8
గురువారం 31 జులై 2025



సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఖాళీగా ఉన్న రెండు సివిల్ అసిస్టెంట్ సర్జన్ వైద్యాధికారి పోస్టుల నియామకానికి ఒప్పంద ప్రతిపాదికన అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో సీతారాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆగస్టు 7 వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నేడు అతిథి ఉపాధ్యాయుల నియామకానికి ఇంటర్వ్యూలు

ఆసిఫాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మజ్యోతిబాపూలే వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల్లో తాత్కాలిక పద్ధతిపై బోధించేందుకు అతిథి ఉపాధ్యాయుల నియామకానికి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని ఉమ్మడి జిల్లా సమన్వయాధికారి శ్రీధర్, జిల్లా కన్వీనర్ శ్వేత బుధవారం ఒక ప్రకటనలో తెలిపా రు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట ఎంజేపీ ఎస్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయని వారు తెలిపారు.

ఆదివాసీల సమావేశం నేడు

కెరమెరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివాసీల సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు రాజ్‌గోండ్ సేవా సమితి అధ్యక్షుడు మోతిరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి గ్రామ పటేళ్లు, యువజన సంఘాల సభ్యులు, మహిళలు, నాయకులు, విద్యార్థి సంఘాల సభ్యులు, రాయి సెంటర్ సర్‌మేడి, తుడుందెబ్బ సంఘం నాయకలు హాజరు కావాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సందీప్‌న గర్‌లో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను హౌసింగ్ పీడీ వేణుగోపాల్ పరిశీలించారు. ఆయన వెంట నాయకులు కార్తీక్, అసద్, షాహీద్, అశోక్ ఉన్నారు.

యువ విలాపం

- రాజీవ్ యువ వికాసం పథకం అమలులో జాప్యం
- ఎదురుచూస్తున్న నిరుద్యోగులు
- ఇంటర్వ్యూలు పూర్తయినా స్పష్టత కరువు
- జిల్లాలో 29 వేల మంది దరఖాస్తు



దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)

ఆసిఫాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): యువత స్వయం ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. దరఖాస్తులు సమర్పించి నాలుగు నెలలు కావస్తున్నా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో రాయితీ రుణాలతో స్వయం ఉపాధి పొందుదామనుకున్న యువత ఆశలు ఆవిరిరవుతున్నా యి. వాస్తవానికి జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు రాయితీ రుణాల మంజూరు పత్రాల ను పంపిణీ చేయాల్సి ఉంది. కానీ చివరి క్షణంలో ప్ర భుత్వం ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంది. రాయితీ రుణాల పంపిణీపై సందిగ్ధత నెలకొంది. దీంతో దరఖా స్తుదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు.

ప్రభుత్వ సూచన మేరకు..

ప్రభుత్వ సూచన మేరకు యువ వికాసం పథకానికి జిల్లాలోని నిరుద్యోగ యువత దరఖాస్తులు చేసుకున్నారు. ఈ పథకం కిద ఎస్సీ, ఎస్టీ. బీసీ, ఈడబ్ల్యూఎస్, మైనార్టీలకు రూ.50 వేల నుంచి మొదలుకొని రూ.4లక్షల వరకు వివిధ రకాల యూనిట్ల కొనుగోలుకు బ్యాంకు లింకేజీతో కూడిన రుణాలు అందించాలని నిర్ణయించింది. రూ.50 వేల యూనిట్‌కు 100 శాతం సబ్సిడీ,రూ. లక్ష నుంచి రూ.2 లక్షల రుణాలకు 80 శాతం సబ్సిడీ, రూ.2 లక్షల పైనుంచి రూ.4 లక్షల యూనిట్ల కోసం70 సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకోసం రేషన్‌కార్డు కలిగిన నిరుపేద కుటుంబంలోని ఒక్కరికి మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఆన్‌లైన్‌తో పాటు అప్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరించారు. దీంతో ఈ పథకా నికి జిల్లాలో వివిధ వర్గాలకు చెందిన నిరుద్యోగులు 29,756 మంది దరఖాస్తులు చేసుకున్నారు. లబ్ధిదారుల ఎంపిక కోసం మండలాల వారీగా రుణ లక్ష్యాలను ఖరారు చేసి అధికారులు,బ్యాంకు సిబ్బందితో కలిసి ఇంటర్వ్యూలు సైతం నిర్వహించారు. దీంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురించాయి. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నుంచి ఈ పథకాన్ని ప్రారంభి స్తామని సర్కార్ ప్రకటన చేసింది. కానీ నేటికి పథకం అమలుకు నోచుకోలేదు. నాలుగు నెలలు కావస్తున్నా ప్రభుత్వం నుంచి యువ వికాసం అమలుపై ఎలాంటి స్పష్టత రాకపోవడంతో దరఖాస్తుదారుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

15 మండలాల పరిధిలో..

జిల్లాలోని 15 మండలాల పరిధిలోని 335 గ్రామ పంచాయతీల పరిధిలో రాజీవ్ యువ వికాసం పథకానికి వివిధ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువత 29.756 మంది దరఖాస్తు చేసుకున్నారు. మండలాల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి. ఆసిఫాబాద్ మండలంలో 3,040 మంది. కాగజ్‌నగర్‌లో 5,486, రెబ్బెనలో 2,827, కౌటాలలో 2,327 మంది దరఖాస్తు చేసుకున్నారు. చింతలమానేపల్లిలో 1,907, జైనూర్‌లో 1,860, బెజ్జూరులో 1,788, కెర మెరిలో 1,761, తిర్యాణి లో 1,690, దహెగాంలో 1.622, సిర్పూర్(టి)లో 1,616, వాంకిడిలో 1,074, పెంచికల్‌పేటలో 1,072, సిర్పూ ర్ (యు)లో 893, లింగాపూర్‌లో 793 మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికీ రుణాలు అందకపోవడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు.

కాలయాపన చేయడం సరికాదు..



- సుచిత్, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం రుణాలు మంజూరీలో కాలయాపన చేయడం సరికాదు. నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పొందేందుకు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. రుణాలు ఇస్తామని చెప్పి దీనిపై నిర్ణయం తీసుకోకుండా దరఖాస్తుదారు లను ప్రభుత్వం మోసం చేయడం సరికాదు. రుణా లను వెంటనే మంజూరు చేయాలి.

కిరాణ దుకాణం ఏర్పాటుకు..



- సురేష్, ఆసిఫాబాద్

రాజీవ్ యువ వికాసం పథకంలో కిరాణ దుకాణం ఏర్పాటు కోసం రూ. 4 లక్షల రుణం కోసం దరఖాస్తు చేసుకునాను. అధికారులు నిర్వహించిన ఇంటర్వ్యూకు కూడా హాజరయ్యాను. ఇంటర్వ్యూలో అధికారులు అన్ని ధ్రువికరణ పత్రాలు పరిశీలించారు. జూన్ రెండు నుంచే రుణాలు ఇస్తామని చెప్పారు. నేటికి రుణం మంజూరు కాలేదు. ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు వెంటనే రుణం మంజూరు చేయాలి.

సమస్యలు వింటూ.. సూచనలు ఇస్తూ..



విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా

బెజ్జూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాల, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను బుధవారం సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా సందర్శించి విద్యార్థుల సమస్యలు వింటూ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గిరిజన ఆశ్రమ పాఠశాల, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులకు సరిపడ మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నామని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. గిరిజన ఆశ్రమ పాఠశాల పైకప్పు నుంచి పెచ్చులు రాలి వర్షపు నీరు పడుతుందని దీంతో ఇబ్బందులు పడుతున్నామని మరమ్మతులు చేపట్టాలని కోరారు. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సమయానికి అనుగుణంగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని ఆమె దృష్టికి రాగా ఆ శాఖాధికారులతో మాట్లాడారు. తక్షణమే అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని అన్నారు. విద్యార్థులు కష్ట పడి చదవాలని, చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఆమె వెంట తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో సునీత తదితరులు ఉన్నారు.

పాము కాటుతో బాలుడి మృతి

రెబ్బెన, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన గొల్లగూడలో బుధవారం తెల్లవారుజామున శ్యాం(4) అనే బాలుడికి పాము కాటు వేయడంతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్యాం అర్థరాత్రి ఏడుస్తుండడంతో మేల్కొన్న తల్లిదండ్రులు అనుష, చిన్నయ్య అతడి శరీరాన్ని పూర్తిగా పరిశీలించారు. చెవిపై రక్తం వస్తుండడంతో అనుమానం వచ్చి వెంటనే మంచంలోని బట్టలను తీసి చూడగా కట్ల పాము కనిపించింది. వెంటనే చికిత్స నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. యాంటీవీనం ఇంజక్షన్ అందుబాటులో లేక బెల్లంపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు.

'అంబులెన్స్ లేక పోవడం వల్లే బాలుడి మృతి'

రెబ్బెన, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురైన రెబ్బెన గొల్ల గూడకు చెందిన శ్యాం రెబ్బెన పీహెచ్‌సీలో అంబుబెన్స్ లేక పోవడం వల్లే సకాలంలో చికిత్స అందక మృతి చెందాడని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులు గౌడ్ తెలిపారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్యాంకు పాము కాటు వేసినట్టు గుర్తించిన తల్లిదండ్రులు చికిత్స కోసం పీహెచ్‌సీకి తీసుకు వచ్చారని అన్నారు. అందుబాటులో అంబులెన్స్ లేక పోవడంతో తండ్రి స్వయంగా బైక్‌పై హుటాహుటిన బెల్లంపల్లి ఆసుపత్రికి తీసుకెళ్లాడని అన్నారు. వైద్య సిబ్బంది అందుబాటులోకి యాంటీవీనం అందుబాటులో పెట్టుకోక పోవడం వల్లే శ్యాం మృతి చెందాడని అన్నారు. కేవలం వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఈ సంఘటన చోటు చేసుకున్నదని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్, శ్యాంరావు, శ్రీశైలం, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో

వాంకిడి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలోని బంబార గిరిజన ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు.

భోజనంలో మెనూ పాటించాలి

సిర్పూర్(టి), జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వడ్డించే భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. మండలంలోని నవేగాం, హుడ్కిలి, జన్కాపూర్ గ్రామాల్లోని పాఠశాలలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు వేడి భోజనం వడ్డించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

కౌటాల సీఐగా సంతోష్‌కుమార్

కౌటాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కౌటాల సీఐగా సంతోష్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ముత్యం రమేష్ ములుగు జిల్లా వెంకటాపూర్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో కరీంనగర్ సీసీఎస్‌లో పని చేస్తున్న సంతోష్‌కమార్ కౌటాలకు బదిలీపై వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సత్వర న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

వాంకిడి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులను నిరంతరం కొనసాగించాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో కార్యద ర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య శాఖ అధికారులతో సమన్వయం చేస్తూ ప్రజలకు పరిసరాల పరిశుభ్ర తపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో ఖాజా అజీజుద్దీన్, ఏపీవో శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



తనిఖీ చేస్తున్న డాక్టర్ వరుణ్

దహెగాం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర వైద్య బృందం సభ్యులు డాక్టర్ వరుణ్ బుధవారం సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అదే విధంగా ఓపీ, ఐపీ గదులను పరిశీలించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డాక్టర్ అశ్విని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీ మండల కార్యవర్గం

కౌటాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీ, పీఎంపీ మండల కార్యవర్గాన్ని బుధవారం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాందేవ్, ప్రధాన కార్యదర్శిగా శంకర్, కోశాధికారిగా సుక్రజీ, ఉపాధ్యక్షడిగా భిక్షపతి, సహాయ కార్యదర్శిగా సతీష్, సలహాదారులుగా గోపాల్, పండరినాథ్, ప్రచార కార్యదర్శిగా కుమార్, గౌరవ అధ్యక్షుడిగా రాజేశ్వర్‌ను ఎన్నుకున్నారు.

ఆలయంలో అన్నదానం

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం దాత వైరగాడే గోవింద్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు అర్చకుడు నగేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ లు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వేణుగోపాల్, వెంకట్‌గౌడ్, వినాయక్, మల్లేష్, శ్యాం, సంతోష్, సాయి, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

బెజ్జూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కోర్తగూడ గ్రామానికి చెందిన కొర్తె శ్రీశైలం కటుంబ సభ్యులకు రూ.54 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బుధవారం ఎమ్మెల్సీ దండె విఠల్ అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సంపూర్ణత అభియాన్ లక్ష్యాలు సాధించాలి



డీపీవో భిక్షపతిగౌడ్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణత అభియాన్ లక్ష్యాలు ఉద్యోగులు, అధికారులు సమన్వయంతో కృషి చేసి సాధించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి సంపూర్ణత అభియాన్‌లో భాగంగా జిల్లా బ్లాక్, తిర్యాణి బ్లాక్ పరిధిలోని క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీతి ఆయోగ్ విభాగం ఆస్పరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం (ఏబీపీ)లో తిర్యాణి బ్లాక్‌ను జాతీయస్థాయిలో ఐదో ర్యాంకు, దక్షిణాది రాష్ట్రాలలో మొదటి ర్యాంకు సాధించడానికి కృషి చేసిన క్షేత్రస్థాయి కృషి చేసిన ప్రతి ఉద్యోగి, అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇదే స్ఫూర్తిగా బ్లాక్‌లను ఆకాంక్షిత నుంచి అభివృద్ధి దిశలో తీసుకెళ్లేందుకు అందరూ కృషి చేయాలన్నారు. సంపూర్ణత అభియాన్ పథకం కింద వైద్య, విద్య, వ్యవసాయ రంగాల అభివృద్ధి, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి హైపర్ టెన్షన్, డయాబెటిస్, క్యాన్సర్ వంటి వ్యాధుల పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేసి పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూసార పరీక్షలు నిర్వహించి కార్డులు జారీ చేయడం తదిత రాలపై అవగాహన కల్పించారు. డీపీవో భిక్షపతిగౌడ్‌తో పాటు ఇతర అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణా భివృద్ధి అధికారి దత్తారావు, గిరిజన సంక్షేమాధికారిణి రమాదేవి, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, ఎంపీడీవో మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణే ధ్యేయం



మాట్లాడుతున్న కాగజ్‌నగర్ పట్టణ సీఐ ప్రేంకుమార్

కాగజ్‌నగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నేరాలను నియంత్రించడానికే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామని పట్టణ సీఐ ప్రేంకుమార్ అన్నారు. కాగజ్‌నగర్ విజయబస్తీలో బుధవారం పట్టణ సీఐ ప్రేంకుమార్ ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలను అప్రమత్తం చేసేందుకు కార్డన్‌సెర్చ్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు లేని 27 బైక్‌లను స్వాధీ నం చేసుకున్నారు. కార్డన్‌సెర్చ్‌లో ఎస్సైలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లింగాపూర్, (ఆంధ్రజ్యోతి): నేరాలను నియంత్రించడానికే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామని సీఐ రమేష్, ఎస్‌ఐ గంగన్న అన్నారు. లింగాపూర్ మండలం లోని పిక్లానాయక్ తండా గ్రామ పంచాయతీలో బుధవారం ఉదయం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వాహనాలకు ధ్రువపత్రాలు తప్పని సరిగా ఉండాలని చెప్పారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరూ పాల్పడవద్దని అన్నారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ ఎసైలతో పాటు 25 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో స్టాల్స్ ఏర్పాటు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో తయారు చేసిన తినుబండారాలు, వస్తువులను బుధవారం అమ్మకానికి స్టాల్స్‌ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్ ఐదు రోజుల పాటు కొనసాగుతాయని డీఆర్డీఏ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

బెజ్జూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): కేజీబీవీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌వో అరుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యూలో ఐదు, సీఈవో గ్రూపులో 10 సీట్లు ఉన్నాయని తెలిపారు.

రహదారులు అధ్వానం



ప్రమాదకరంగా మారిన అయ్యప్ప ఆలయ రహదారి

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పలు ఆలయాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో ఆలయాలకు వెళ్లె భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పెద్దవాగు సమీపంలోని అయ్యప్ప, బాలేశ్వర ఆలయం, పట్టణంలోని పోచమ్మ ఆలయాలకు వెళ్లే రహదారులు పూర్తిగా బురదమయంగా మారాయి. బాలేశ్వర అలయానికి వెళ్లె రహదారికి ఇరువైపులా మురికి కాలువలు లేనందున మట్టి రోడ్డుపైకి చేరడంతో వాహ నాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అలాగే అయ్యప్ప ఆలయానికి వెళ్లే రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది.

సెక్షన్ అధికారికి పురస్కారం

సిర్పూర్(టి), జూలై 30 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) రేంజ్‌లోని సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న మోహన్‌రావు ఉత్తమ పురస్కారం అందుకున్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవంలో భాగంగా పులుల సంరక్షణలో ప్రతిభ కనబర్చిన వారికి రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పురస్కారాలు అందజేసింది. ఇందులో భాగంగా సిర్పూర్(టి) రేంజ్‌లోని సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న మోహన్‌రావు అవార్డుకు ఎంపిక కాగా పీసీసీఎఫ్ సువర్ణ, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఏలూసింగ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ



తనిఖీ చేస్తున్న ఏడీఏ మనోహర్

బెజ్జూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను బుధవారం ఏడీఏ మనోహర్ తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించారు. ఎరువుల స్టాక్ వివరాలను యాప్‌లో నమోదు చేయాలని, ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రశీదులు ఇవ్వాలని సూచించారు.. ఆయన వెంట వ్యవసాయాధికారి నాగరాజు ఉన్నారు.

సమావేశాలకు తరలిరావాలి

కౌటాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశాలకు పింఛన్‌దారులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. మండలంలోని ముత్తంపేటలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. ఆగస్టు 4న ఆసిఫాబాద్‌లో, 13న హైదరాబాద్‌లో వికలాంగుల, వృద్ధుల, వితం తువు, ఒంటరి మహిళల పింఛన్‌దారుల సమావేశాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో సత్యనారాయణ, శంకర్, దేవేందర్, సత్తయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం పరిశీలన

కౌటాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భవిత సెంటర్‌ను బుధవారం ఎంఈవో హనుమంతు పరిశీలించారు. ఈ సంద ర్భంగా దివ్యాంగ విద్యార్థులకు విద్యతో పాటు మధ్యాహ్న భోజనం అందే విధంగా ఫేస్ రికగ్నిషన్ హాజరును తీసుకోవాలని సూచించారు.



తగ్గిన మిర్చి సాగు

- గిట్టుబాటు ధర రాకపోవడమే కారణం
- ప్రత్యామ్నాయ పంటలపై రైతుల ఆసక్తి

చింతలమానేపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్ డివిజన్‌లో వానాకాలంలో మిర్చి పంట సాగు తగ్గుతోంది. గతేడాది ఆశించిన ధర లేక పోవడం, పెట్టుబడి ఖర్చులు విప రీతంగా పెరగడంతో రైతులు ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు చూస్తున్నారు. గతేడాది సాగు చేసిన మిర్చి రైతులు ప్రస్తుతం పత్తి, ఇతర పంటలను సాగు చేస్తున్నారు. గతేడాది సిర్పూర్ నియోజకవర్గంలో రెండు ఎకరాలకు పైగా మిర్చి పంట సాగు కాగా ఈ ఏడాది మిర్చి పంట సగానికి సగం అంటే దాదాపుగా సుమారు 800 ఎకరాలకు తగ్గిం ది. మార్కెట్‌లో మిర్చికి ధర లేక పోవడం తెగుళ్ల అధికంగా రావడం వల్లే రైతులు సాగు చేయడం లేదని చెబుతున్నారు.

విపరీతమైన ఖర్చులు..

మూడేళ్ల క్రితం వరకు ఎకరా మిర్చి సాగుకు ఖర్చు రూ. 45 వేల నుంచి రూ. 56 వేల వరకు ఉండేది. ఆ సమయంలో 23 నుంచి 28 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. క్వింటాల్ ధర కూడా రూ. 20వేల వరకు పలికేది. డిమాండ్ ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం చీడ పీడల కారణంగా ఖర్చులు పెరిగాయి. ఎకరా మిర్చి సాగుకు సుమారుగా రూ. లక్ష వరకు ఖర్చు అవుతు న్నట్లు రైతులు చెబుతున్నారు. దీనికి తోడు మిర్చి ధర రూ. 8వేల నుంచి 12వేల వరకు మాత్రమే ఉండ డంతో రైతులకు ఆశిం చిన స్థాయిలో ధరలు లేక పోవడం, విపరీతమైన ఖర్చులు పెరగడంతో రైతులు నష్టపోవాల్సి వస్తున్నది. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంట లైన పత్తి, మొక్కజొన్న, వరి, ఇతర పంటల వైపు రైతులు మొగ్గు చూపు తున్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు గతేడాది సాగు చేసిన మిర్చి పంటను వదిలేసి పత్తి వేశారు. మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేక పోవ డమే మిర్చి సాగుకు రైతులు ముందుకు రావడం లేదు. సాగు విస్తీర్ణంపై ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితుల్లో రైతులకు సంబంధిత అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



నష్టాలు రావడంతోనే..: జున్గరి శ్రీనివాస్, రైతు, కర్జెల్లి



రెండేళ్లుగా మిర్చి పంటలో నష్టాలు ఎదురవడంతో ఈ సారి పత్తి పంట సాగు చేస్తున్న. గతంలో మిర్చి సాగు చేసిన చాలా మంది రైతులు ఈ ఏడాది ఇతర పంటలు వేశారు. పెట్టుబడి ఖర్చులు పెరిగాయి. దిగుబడి రావడం లేదు. దీనికి తోడు జిల్లాలో మిర్చి మార్కెట్ లేక పోవడంతో మహారాష్ట్ర, వరంగల్ ప్రాంతాలకు తరలించాల్సి వస్తోంది. రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి.

ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శిక్షణలో నేర్చుకున్న అంశాలను తమ బోధనలో అమలు చేసి విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధంచేలా చూడాలని ఏసీఎం వో ఉద్ధవ్ అన్నారు. బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో బుధవారం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో 6, 7,8 తరగతుల వరకు ఆంగ్లం బోధిస్తున్న ఉపాధ్యాయులకు మూడు రోజుల పాటు జరిగిన శిక్షణ ముగింపులో ఆయన మాట్లాడారు. మూడు రోజులు నేర్చుకు అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. గిరిజన విద్యార్థుల్లో మరింత ఆంగ్ల భాష సామర్థ్యాల పెంపుకు ఉపాధ్యాయులు అంకిత భావంతో కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మంచిర్యాల ఏసీఎంవో లక్ష్మయ్య, డీఎస్‌వో మీనారెడ్డి, యంగ్ హెడ్ క్లబ్ భారత్ దేఖో సంస్థ ప్రతినిధులు రోమిల,తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన శాఖలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు సంఘటితంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ సమావేశంలో ఆ సంగం నాయకులు గోపాల్, అనంత్, కృష్ణరావ్, మాదవ్‌రావు, యశ్వంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల కోసం పడిగాపులు

- ఫేస్ రికగ్నిషన్ నిబంధనతో ఆలస్యం

ఆసిఫాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చేయూత పథకం కింద అందిస్తున్న పింఛన్ల పంపిణీలో ఫేస్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు) నిబంధనతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని పోస్టాఫీసు వద్ద దివ్యాంగ, వితంతు, వృద్ధాప్య, తదితర పెన్షన్ దారులు బుధవారం గంటల కొద్ది పడిగాపులు పడాల్సి వచ్చింది. ప్రభుత్వం పింఛన్ పంపిణీలో చేయూత యాప్‌లో ముఖ గుర్తింపు తప్పని సరి చేసింది. దీంతో పెన్షన్ పంపిణీ ప్రక్రియ మరింత ఆలస్యమవుతున్నది. గతంలో వేలిముద్రల ఆధారంగా అధికారులు పెన్షన్ పంపిణీ చేసేవారు. అందులో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయన్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నెల నుంచి ముఖ గుర్తింపు ఆధారంగా పెన్షన్ పంపిణీ చేస్తున్నారు. దీంతో పెన్షన్‌దారులు గంటల పాటు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా కేద్రంలోని పోస్టాఫీసు సిబ్బంది ప్రతి నెల పెన్షన్ డబ్బులు పంపిణీ చేస్తున్నారు. సంబంధిత శాఖాధికారులు పోస్టాఫీసు సిబ్బందికి ట్యాబ్‌లు పంపిణీ చేయలేదు. దీంతో సిబ్బంది మొబైల్‌లోనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని లబ్ధిదారుల ఫొటోలను అప్‌లోడ్ చేసి పెన్షన్ చెల్లించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. చేయూత యాప్‌లో ఫొటో అప్‌లోడ్ సందర్భంలో కొంత మంది పెన్షన్ దారుల ఆధార్ కార్డు అప్‌డేట్ లేక పోవడంతో వారి వివరాలను యాప్‌లో తీసుకోవడం లేదు. దీంతో పెన్షన్ దారులు వెనుతిరిగి పోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. పోస్టాఫీసు వద్ద ఇరుకు సందులో కౌంటర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, రెండు కౌంటర్లు ఏర్పాటు చేయాలని పెన్షన్‌దారులు కోరుతున్నారు. ఈ విషయమై సబ్ పోస్టు మాస్టర్ అవినాష్‌కుమార్‌ను వివరణ కోరగా యాప్‌లో వివరాల నమోదు చేయడం ద్వారా ఆలస్యమవుతున్నదని తెలిపారు.



పోస్టాఫీసు వద్ద పడిగాపులు కాస్తున్న పింఛన్‌దారులు

సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డులే ప్రామాణికం

పెంచికలపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో రేషన్ కార్డులు ప్రామాణికంగా నిలుస్తాయని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. పెంచికలపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల మంజూరు పత్రాలను బుధవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాలతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలు లబ్ధిదారలకు చేరడంలో రేషన్ కార్డుఏల ప్రామాణికంగా నిలుస్తాయని తెలిపారు. ప్రభుత్వం చేటప్టిన ప్రజా పాలన కార్యక్రమంలో అర్హులైన వారికి రేషన్ కార్డుల కొరకు దరఖాస్తులు సేకరించి క్షేత్రస్థాయిలో విచారించి అర్హులైన పేద వారికి ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేసిందని తెలిపారు. సుదర్ఘీకాలం తరువాత ప్రభుత్వం రేషన్ కార్డులు అందిస్తుందన్నారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, వివాహం అయినవారు, పిల్లల పేర్లను రేషన్ కార్డులలో నమోదు కొరకు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నట్లయితే తహసీల్దార్, సిబ్బంది క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులైన వారికి కార్డులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎమ్మెల్సీ దండె విఠల్, అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాలతో కలిసి రేషన్ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. ఇంకా రాని వారు ఎవరైనా ఉంటే మీ సేవలో దరఖాస్తు చేసుకున్నట్లయితే సంబంధిత తహసీల్దార్‌లు రేషన్ కార్డలను మంజూరు చేయిస్తారని తెలిపారు. రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందని, సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు ప్రమాణికం కావడంతో ప్రతి ఒక్కరికి కార్డు అవసరమైందని అన్నారు. రేషన్ కార్డు ద్వారా రూ.10 లక్షల ఆరోగ్య భీమా సేవలు కూడా అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏడీప మనోహర్, తహసీల్దార్ రామ్మోహన్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, వ్యవసాయాధికారి నాగరాజు, నాయకులు గణపతి, శ్రీవర్ధన్, విశ్వేశ్వర్, నాహీర్ అలీ, శంకర్ పాల్గొన్నారు.



మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ విఠల్, కలెక్టర్ వెంకటేష్ దోత్రే

బావిలో పడి వృద్ధుడి మృతి

లక్షెట్టిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాలకు చెందిన గరిగె రాజలింగు(76) అనే వృద్ధుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజలింగు నాలు గు నెలల నుంచి మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. మతిస్థిమితం కూడా సరిగ్గా లేదు. కుటుంబస భ్యులు ఆసుపత్రుల్లో చూపించి మందులు వాడినా నయం కాలేదు. ఈనెల 29న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబీకులు వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం ఇంటి సమీపంలోని బావిలో మృతదేహం కనిపించడంతో పోలీసు లకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి బావిలో నుంచి రాజలింగు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు రాజలింగు కూతురు పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.



రాజలింగు(ఫైల్)

చికిత్స పొందుతూ మహిళ..

చింతలమానేపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చింతమాలనేపల్లి మండలం బాలాజీఅనుకోడ గ్రామానికి చంఎదిన దుబ్బుల లక్ష్మి (55) అనే మహిళ అడవి పంది దా డిలో గాయపడి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందింది. గ్రామస్థులు, తెలిపిన వివరాల ప్రకారం... దుబ్బుల లక్ష్మి శనివారం పొలం పనులకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో మార్గ మధ్యలో దాడి చేసి గాయపరిచింది. కుటుంబీకులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది.



లక్ష్మి(ఫైల్)

ట్రాక్టర్ పైనుంచి జారిపడి మహిళ దుర్మరణం

నెన్నెల, జులై 30 (ఆంధ్రజ్యోతి): ఇసుక ట్రాక్టర్ పైనుంచి జారిపడిన మహిళ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రసాద్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మన్నెగూడం పంచాయతీ పరిధిలోని లంబాడితండాకు చెంది న ధరవత్ తులసి (32) బ్యాంకు పని మీద మండల కేంద్రానికి కాలి నడకన బయలుదేరింది. మార్గమధ్యంలో కలిసిన ఇసుక ట్రాక్టర్ (నంబర్ టీఎస్ 20టీ 6029)పై ఎక్కి ఇంజన్ వెనుకాల ట్రాలీ నొగలపై నిలబడింది. నెన్నెల కంబాలకుంట సమీపంలోని మూలమలుపు వద్ద ట్రాక్టర్‌ను వేగంగా తిప్పడంతో తులసి పట్టుతప్పి కింద పడింది. తలమీద నుంచి ట్రాలీ టైరు వెల్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు కాసిపేట మండలం పెద్దన పల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కుడిమేత లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు. మృతురాలి భర్త రాజ్‌కుమార్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, కొడుకు, కూతురు స్థానిక ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్నారు.



తులసి(ఫైల్)

విద్యుదాఘాతంతో ఆవు మృతి

దండేపల్లి జూలై 30 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ గ్రామానికి చెందిన చాత రాజు ఆశయ్య అనే రైతుకు చెందిన ఆవు బుధవారం విద్యుదాఘాతంతో గురై మృతి చెందింది. ఉదయం రైతు తనకు ఉన్న రెండు గేదెలను ఊరు శివారులోకి మేతకు తీసుకెళ్లాడు. మేత మేస్తున్న ఆవు అక్కడే ఉన్న విద్యుత్ పోల్‌కు తగిలి పడిపోయింది. కరెంటు పోల్‌కు ఉన్న వైరు ఊడిపడి విద్యుత్ పోల్‌కు ఉన్న వైరుకు తగల డంతో విద్యుదాఘాతంతో చనిపోయినట్టు స్థానికులు గుర్తించారు. ఆవు విలువ సుమారు 80వేల రూపాయలు ఉంటుందని, అధికారులు ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.



మృతి చెందిన ఆవు



లాభాల వాటా ప్రకటించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

మందమర్రిటౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులకు 2024-25 లాభాల వాటాను ప్రకటించి వెంటనే 35 శాతం చెల్లించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ సలేంద్ర సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు భీమనాధుని సుదర్శన్, జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కేకే 5 గనిపై బుధవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో వారు మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. స్ట్రక్చర్ సమావేశాల్లో ప్రధాన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా ఒత్తిడి చేస్తున్నామని తెలిపారు. కార్మికులు శ్రమించి ఉత్పత్తిసాధిస్తు న్నారని తెలిపారు. నాణ్యమైన పని ముట్లు, బూట్లు, గ్లౌజ్‌లు, చలికోట్లు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సంపత్, ప్రేమ్‌లాల్, రాజేశ్వర్‌రావు, బానయ్య పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి అంగీకారం

మందమర్రిటౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ నుంచి భగత్‌సింగ్ నగర్, శ్రీపతినగర్, రెండవ జోన్‌లకు వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు పాడైపోవడంతో కొత్తగా రోడ్డు వేయడానికి యాజమాన్యం అంగీకారం తెలిపిందని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. స్థానికంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్ట్రక్చర్ సమావేశంలో సిమెంటు రోడ్డు వేయాలని విన్నవించామని చెప్పారు. దీంతో యాజమాన్యం స్పందించి త్వరలోనే పనులను ప్రారంభిస్తామని చెప్పిందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు భీమనాధుని సుదర్శన్, నాయకులు కంది శ్రీనివాస్, కల్వల శ్రీనివాస్,ఓదెలు, వెంకన్న, రసూల్, పద్మ, శ్రీనివాస్, కాలనీ వాసులు రాజశేఖర్, లక్ష్మణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు కృషి

శ్రీరాంపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సింగ రేణి గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా కార్మికులకు తాము ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తున్నామని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య అన్నారు. ఆర్‌కే న్యూటెక్ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కారుణ్య నియామకాల వయస్సును 40 ఏళ్లకు పెంచామని, సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్ ను ప్రవేశపెట్టేలా తాము కృషి చేశా మన్నారు. జేఎం ఈటీలను తిరిగి ఉద్యోగంలోకి తీసుకునేందుకు ఒప్పించామన్నారు. యాజమాన్యం సహకారంతో అతి త్వరలో సొంతింటి పథకం, కార్పొరేట్ ఆస్పత్రి ఏర్పాటు జరుగుతుందని అన్నారు. తాము చేస్తున్న పనులను ఐఎన్‌టీయూసీ నాయకులు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సింగరేణి సంస్థ, కార్మికులపై చిత్తశుద్ధి ఉంటే సంస్థకు ప్రభుత్వం నుంచి రావాల్సిన కోట్ల రూపాయలు ఇప్పించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు బద్రి బుచ్చ య్య, ప్రసాద్‌రెడ్డి, సంపత్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య

సమస్యలు పరిష్కరిస్తాం

శ్రీరాంపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలలుగా గుర్తింపు యూనియన్ నాయకులు విన్నవిస్తున్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. జీఎం కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకులతో బుధవారం స్ట్రక్చర్ మీటింగ్ నిర్వహించారు. సమావేశంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఏజీఎం(ఫైనాన్స్) బీభత్స, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, రవి కుమార్, పీవోలు ఏవీరెడ్డి, వెంకటేశ్వర్లు. డీజీఎంలు అనిల్‌కుమార్, రాజన్న ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ వర్కర్స్ వేతనాలు పెంచాలి

శ్రీరాంపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేసే 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి. బ్రహ్మానందం కోరారు. ఈ మేరకు బుధవారం సింగరేణి కార్పొరేట్ కార్యాలయంలో డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రుకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాంట్రాక్ట్ కార్మికుల కోసం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేస్తున్నామన్నారు. అయినా సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచడం లేదని ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికుల సీఎంపీఎఫ్ వివరాలను ఆన్‌లైన్ చేస్తామని యాజమాన్యం హామీ ఇచ్చినా ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. ఎన్ని డబ్బులు ఉన్నాయో పైగా లెక్కలు చూపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ఏరియాల్లో కాంట్రాక్టర్లు మొదటి వారంలో వేతనాలు ఇవ్వడం లేదని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సింగరేణివ్యాప్తంగా పనిచేసే 210 మంది సులభ్ కాంప్లెక్స్ కార్మికులకు సులభ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంస్థ ద్వారా ఈఎస్‌ఐ, ఈపీఎఫ్, బోనస్ అమలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాసుద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. వెంకన్న, నాయకుడు సంజీవ్ పాల్గొన్నారు.

40 శాతం లాభాల వాటా చెల్లించాలి

శ్రీరాంపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలను ప్రకటించి కార్మికులకు 40 శాతం వాటా చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి డిమాండ్ చేశారు. ఆర్‌కే 7 గనిపై బుధవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌కు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 69 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి కాగా, 40 వేల కోట్ల రూపాయలు సంస్థకు వచ్చాయన్నారు. వాటి నుంచి 40 శాతం వాటాగా ప్రకటించి అందించాలని వారు కోరారు. యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉప ప్రధాన కార్యదర్శి పొన్నమనేని వేణుగోపాలరావు, కేంద్ర కార్యదర్శి మాదాసి రవీందర్, ఏరియా కార్యదర్శి రాగం రాజేందర్, నాయకులు కట్కూరి సతీష్, బోయిన మల్లయ్య, గోళ్ల మహేందర్, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

జైపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : భావి తరాల భవిష్యత్ దృష్ట్యా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఫారెస్టు అడ్వైజర్ పరిగెన్, శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఏక్ పేడ్ మాకే నామ్‌పే, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే ఓసీపీ గని ఆవరణలో మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఓసీపీలు, పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటుతూ వాటిని పరిరక్షిస్తూ ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో టూ జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీసైదా, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, అధికారులు బీభత్స వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రామకృష్ణరావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సింగరేణి అధికారులు

'ఆరోపణలను ఖండిస్తున్నాం'

శ్రీరాంపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ నాయకులు చేయని పనులను తామే చేశామని చెప్పుకోవడం దుర్మార్గమని, పైగా తమ యూనియన్‌పై చేస్తున్న ఆరోపణలను ఖండిస్తున్నామని ఐఎన్‌టీయూసీ సీనియర్ ఉపాధ్యక్షుడు శంకర్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఆర్‌కే 5 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఏఐటీయూసీ నాయకులు వారికి సంబంధం లేని విషయాలను ప్రస్తావించి ఘనతను దక్కించుకోవాలని చూస్తున్నారని పేర్కొన్నారు. డిపెండెంట్ల వయో పరిమితిని పెంచిన ఘనత ఐఎన్‌టీయూసీకి దక్కుతుందని తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

భీమారం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లవాగు ప్రాజెక్టు సమీపంలో చెన్నూరు మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన భీమిని లక్ష్మణ్(48) అనే వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టంపేట గ్రామానికి చెందిన లక్ష్మణ్ ఈ నెల 23న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. బంధువుల ఇంటికి వెళ్లాడనుకున్న కుటుంబీకులు ఎంతకు తిరిగి ఇంటికి రాకపోవడంతో ఈ నెల 28న చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బుధవారం గొల్లవాగు పరిసర ప్రాంతంలో పశువుల కాపరి మృతదేహం గుర్తించి గ్రామస్థులకు సమాచారం అందించాడు. దీంతో వారు మృతుని కుమారుడు ఉదయ్‌కు సమాచారం అందించడంతో అతను వచ్చి మృతదేహాన్ని చూసి తన తండ్రిదిగా గుర్తించాడు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని పేర్కొన్నారు.

ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలి

కోటపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఐటీడీఏ పీవోకు వినతిపత్రం ఇచ్చినట్లు తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు జేక శేఖర్ అన్నారు. సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని, ఇది వరకే పోడు పట్టాలు మంజూరైన ఆదివాసీ రైతుల మీద అటవీశాఖ అధికారుల దాడులు ఆపాలన్నారు. టైగర్ జోన్, వైల్డ్ లైఫ్ సంచార్‌ను నిలిపివేయాలని, జీవో నెంబరు 49ని పూర్తిగా రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చెడెంక మాంతయ్య, తలండి అశోక్, దుగ్నే జైలు, రెడ్డి రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

ఖోఖో ఆడుతూ విద్యార్థికి గాయాలు

నస్పూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో ఖోఖో ఆడుతూ కుంచం చరణ్ అదుపు తప్పి కింద పడడంతో కుడి కాలు విరిగింది. వెంటనే పాఠశాల ఉపాధ్యాయులు అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తొమ్మిదో తరగతి చదువుతున్న చరణ్ మధ్యాహ్నం ఆటల సమయంలో ఖోఖో ఆడుతూ పరుగెత్తాడు. అదుపుతప్పి కింద పడిపోగా కుడి మోకాలు పైభాగంలో ఎముక విరిగింది. ప్రస్తుతం విద్యార్థి చరణ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్‌రావు ఆసుపత్రికి చేరుకుని విద్యార్థిని పరామర్శించి విషయం తెలుసుకున్నారు. పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్ఐ, ఏఐఎస్‌బీ, యూఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థిని పరామర్శించారు.


బస్తీదవాఖానాలో రోగిని పరిశీలిస్తున్న వైద్యురాలు



బెల్లంపల్లి మున్సిపాలిటీలో బస్తీ దవాఖాన

పేరుకే.. బస్తీ దవాఖానాలు

- జనాభాకు అనుగుణంగా ఏర్పాటు కాని వైనం
- పదివేల జనాభాకు ఒకటి ఉండాలి
- ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజలు

బెల్లంపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు గత ప్రభుత్వం బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసింది. అయితే మున్సిపాలిటీలో ప్రజలకు సరిపడా దవాఖానాలను ఏర్పాటు చేయకపోవడంతో రోగులకు అనుకున్న మేర సేవలు అందడం లేదు. పదివేల జనాభాకు ఒక బస్తీ దవాఖానాను ఏర్పాటు చేయాల్సి ఉండగా నేటికీ పూర్తిస్థాయిలో ఏర్పాటు కాలేదు. అలాగే పలు చోట్ల ఉన్న బస్తీ దవాఖానాల్లో అరకొర వసతులు, మందులతో పూర్తిస్థాయి వైద్యం అందడం లేదు. దీంతో పట్టణాల్లోని ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులు ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

జిల్లాలో నాలుగు మాత్రమే..

అందరికీ ఆరోగ్యం అందాలి. అనారోగ్యాన బారిన పడితే వార్డుస్థాయిలోనే నయం అవ్వాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో ఏడు మున్సిపాలిటీలు ఉండగా కేవలం నాలుగు బస్తీ దవాఖానాలు మాత్రమే ఉన్నాయి. ఇందులో మంచిర్యాల మున్సిపాలిటీలోని సాయికుంట, హమాలీవాడలో అలాగే బెల్లంపల్లి రడగంబాల బస్తీలో ఇటీవల చెన్నూర్ మున్సిపాలిటీలో ఈ ద వాఖానాలను ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలో ప్రతీ పదివేల మందికి ఒక బస్తీద వాఖాన ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు ఉన్నప్పటికీ ఆ దిశగా అడుగులు పడడం లేదు. దీంతో ప్రజలకు చిన్న చిన్న అనారోగ్య సమస్యలు వస్తే స్థానిక ఏరియా ఆ సుపత్రులపై ఆధారపడుతున్నారు. ఏరియా ఆసుపత్రుల్లో వైద్యులు అందుబాటులో లేకపోతే స్థానిక ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారు. ప్రస్తుతం వర్షకాలం కావడంతో సీజనల్ వ్యాధులు వాపిస్తుండడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అరకొర సిబ్బందే...

జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఏర్పాటైన ప్రతి బస్తీ దవాఖానాలో వైద్యులు, స్టాఫ్‌నర్సు, హెల్పర్లు ఉండాలి. శనివారం మినహా ప్రతిరోజు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం4 గంటల వరకు ఈ బస్తీదవాఖానాలు పని చేస్తాయి. కొన్ని బస్తీ దవాఖానాల్లో పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవడం, వైద్యపరికరాలు అందుబాటులో లేకపోవడం వివిధ వ్యాధులకు సంబంధించిన పూర్తిస్థాయిలో మందులు కూడా ఉండడం లేదు. రోగులకు అనుకున్న మేర వైద్య సేవలందడం లేదనే విమర్శలు వెల్లు వెత్తు తున్నాయి. అలాగే పలు బస్తీ దవాఖా నాలకు సొంత భవనాలు లేక కమ్యూనిటీ హాల్‌లో, ఇతర భవనాల్లో కొనసాగిస్తున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం మున్సిపాలిటి ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలందే విధంగా బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేయాలని మెరుగైన వైద్యసేవలం దించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేయాలి
- కరుణాకర్, బెల్లంపల్లి



ప్రభుత్వం ప్రజలకు సరిపడే విధంగా ప్రతి వార్డులో బస్తీ దవాఖానాను ఏర్పాటు చేయాలి. చిన్న చిన్న అనారోగ్య సమస్యలు వస్తే దూరంలో ఉన్న ఏరియా ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి వెళ్లాల్సి వస్తోంది. పట్టణాల్లో బస్తీ దవాఖానాలు లేకపోవడంతో వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరి కొందరైతే ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వం బస్తీ దవాఖానాలను ఏర్పాటుచేసి మెరుగైన వైద్య సేవలందించాలి.

చదివిన డిగ్రీ ఒకటి.. వైద్యం మరొకటి

(5వ పేజీ తరువాయి)

ఎలాంటి అర్హత లేకుండా యూరాలజీ విభాగంలో వైద్యం చేసి అనారోగ్యంపాలు చేశాడని పేర్కొంటూ బాధితుడు టీజీఎంసీకి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీకరించిన టీజీఎంసీ వైద్యుడి గురించి ఆరా తీస్తే అర్హతలు లేనట్లుగా తేలింది. వైద్యుడు ఎంబీబీఎస్‌తోపాటు జనరల్ సర్జన్ పట్టా పొందినప్పటికీ ఎంబీబీఎస్ వరకే టీజీఎంసీలో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తేలింది. ప్రతి ఐదేళ్లకు ఒకసారి రెన్యూవల్ చేయించాల్సి ఉండగా, అదికూడా చేయలేదని సమాచారం. పైగా యూరాలజీ విభాగంలో చికిత్సలు అందిస్తున్నట్లు గుర్తించిన టీజీఎంసీ తదుపరి విచారణకు హాజరు కావాలంటూ ఆయనకు జూన్ 23న నోటీసు జారీ చేసింది. టీజీఎంసీ నిబంధనలకు విరుద్ధంగా చికిత్స అందిస్తున్న వైద్యుడిని చట్ట ప్రకారం సస్పెండ్ చేసే అవకాశాలున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, టీజీఎంసీ జిల్లా వ్యాప్తంగా పలు ఆసుపత్రులు నిర్వహించే వైద్యులకు నోటీసులు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 281 ప్రైవేటు ఆసుపత్రులు ఉండగా, వాటిని నిర్వహిస్తున్న వారిలో సింహభాగం అర్హతలేని వారే ఉన్నట్లు సమాచారం.

మచ్చుకు కొన్ని సంఘటనలు...

- ఐదారు నెలల క్రితం జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ డిస్ట్రిక్ హాస్పిటల్ సమీపంలోగల ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగి బ్రెయిన్ డెడ్ అయ్యాడు. క్వాలిఫైడ్ వైద్యులులేక ఆసుపత్రిలోనే గంటలకు గంటలు ఉంచగా, కుటుంబ సభ్యుల ఒత్తిడితో ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ విషయమైనా టీజీఎంసీ నోటీసులు ఇవ్వగా, క్వాలిఫైడ్ డాక్టర్లు లేరని స్పష్టమైంది.
- జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా సమీపంలోగల ఓ ఆసుపత్రిలో వైద్యుడు కార్డియాలజీ విభాగంలో చికిత్స అందించేవాడు. ఓ రోగికి ఇచ్చిన చికిత్స కారణంగా అది బెడిసి కొట్టడంతో ఆయన బంధువులు, వైద్యుడి మధ్య తీవ్ర గొడవకు దారి తీసింది. బంధువులు వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా, తనిఖీలు చేయడంతో సదరు వైద్యుడికి ఎంబీబీఎస్ మినహా, పీజీ అర్హత లేదని రుజువైంది. దీంతో సదరు ఆసుపత్రిని అధికారులు సీజ్ చేశారు.
- జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా సమీపంలోగల ఓ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో వైద్యుడికి కేవలం ఎంబీబీఎస్ అర్హతలు మాత్రమే ఉన్నాయి. అయినప్పటికీ అతడు ఎండీ ఫిజీషియన్ విభాగంలో కూడా చికిత్సలు అందించేవాడు. ఈ క్రమంలో టీజీఎంసీ నోటీసులు జారీ చేయడంతో అసలు విషయం వెలుగుచూసింది. ఇలా జిల్లా వ్యాప్తంగా పలు ప్రత్యేకలతో నడుస్తున్న వివిధ ఆసుపత్రుల్లో అర్హతలులేనివారే చికిత్సలు అందిస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై వైద్య ఆరోగ్యశాఖ లోతుగా పరిశీలిస్తే మరిన్ని విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

పీహెచ్‌సీ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలి
కలెక్టర్ కుమార్ దీపక్

భీమారం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు సూచించారు. ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను ఎంపీడీవో మధుసూదన్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, తరగతి గదులు, హాజరు పట్టికలను, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ ఫెర్టిలైజర్ దుకాణాన్ని సందర్శించి స్టాకు నిల్వలు, ధరల పట్టికను, రశీదు పుస్తకాలను పరిశీలించారు. బూరుగుపల్లిలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా నిర్మించుకోవాలని సూచించారు. దాంపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను పరీక్షించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎస్ఐ శ్వేత, జిల్లా వ్యవసాయాధికారి చత్రు, తహసీల్దార్ సదానందం తదితరులు ఉన్నారు.

సైబర్ క్రైం ముఠా పట్టివేత

- 250 సిమ్‌కార్డులతో ప్రత్యేక డివైజ్
- ఆంధ్రప్రదేశ్ నుంచి సిమ్‌ల కొనుగోలు
- వివరాలు వెల్లడించిన డీసీపీ భాస్కర్


వివరాలు వెల్లడిస్తున్న మంచిర్యాల డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా జన్నారంలో భారీ సైబర్ క్రైంకు పాల్పడుతున్న ముఠాలోని నిందితులను మంచిర్యాల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను బుధవారం తన కార్యాలయంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్ వివరాలు వెల్లడించారు. మంచిర్యాల, రామగుండం పోలీసు కమిషనర్, టీజీసీఎస్‌బీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీకమ్యూనికేషన్ రామగుండం పోలీసులు సంయుక్త ఆపరేషన్ నిర్వహించి సైబర్ ఫైనాన్షియల్ ఫ్రాడ్ సెంట ర్‌ను పట్టుకున్నట్లు డీసీపీ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యాండ్రపు కామేశ్, జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బాపు బాపయ్య, బాపు మధూకర్, జన్నారం మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన బొట్ల రాజేశ్, ఆంధ్రప్రదేశ్‌కు వేదాంతపూర గ్రామానికి చెందిన సాయిక్రిష్ణ అలియాస్ జాక్ కలిసి మంచిర్యాల జిల్లా జన్నారంలో ఒక ప్రత్యేక డివైజ్ ద్వారా 250 సిమ్‌లతో ప్రత్యేక సెటప్‌ను బోడ ప్రభాకర్ ఇంట్లో ఏర్పాటు చేసుకున్నారు. 45 రోజుల నుంచి రోజుకు 12వేల మందికి చొప్పున కాల్స్ చేస్తూ సైబర్ క్రైంకు పాల్పడ్డారు. ఈ సిమ్‌లను ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం జిల్లాకు చెందిన ఓ వక్తి వద్ద నాలుగు లక్షల రూపాయలకు కొనుగోలు చేశారు. జాక్ అనే వ్యక్తి దీనిలో ప్రధాన నిందితుడు. కాంబోడియాలో ఉంటున్న జాక్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కామేశ్‌తో పరిచయం చేసుకొన్నారు. సైబర్ క్రైం కోసం ఒక గ్రామాన్ని ఎంచుకొని ప్రత్యేక సెటప్‌లో సుమారు 260 సిమ్‌కార్డులు, యుఎస్‌బీ కేబుల్, డీలింగ్ పోర్టర్‌లు ఒకే సమయంలో 200 సిమ్‌లను ఆపరేటింగ్ చేసే డివైజ్ ఏర్పాటు చేసుకున్నారు. దీనినుంచి పలువురికి కాల్ చేస్తూ సైబర్ క్రైంకు పాల్పడ్డారు. పూర్తి దర్యాప్తు అనంతరం సైబర్‌క్రైంకు ఎంత మంది బాధితులు ఉన్నారనే విషయాన్ని వెల్లడిస్తామని డీసీపీ తెలిపారు. వారి అకౌంట్లు పూర్తి దర్యాప్తు అనంతరం ఎంత మేరకు మోసం జరిగిందనే విషయాన్ని వెల్లడిస్తామన్నారు. ఒకే టవర్ నుంచి వేల కాల్స్ వెళ్లడం వల్ల టెలీకమ్యూనికేషన్ అధికారులు రామగుండం పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆపరేషన్ నిర్వహించామన్నారు. ప్రధాన నిందితుడు జాక్ పరారీలో ఉన్నాడని తెలిపారు. ఆపరేషన్‌లో మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, సైబర్ క్రైం డీఎస్పీ వెంకటరమణారెడ్డి, సీఐ రమణమూర్తి, టెలీకమ్యూనికేషన్ డైరెక్టర్ జనరల్ అనురాగ్, సిబ్బంది పాల్గొన్నారు.

జన్నారంలో కలకలం

జన్నారం: మండలంలోని సైబర్ క్రైం పోలీసుల సోదాలు నిర్వహించడంతో ఒక్కసారిగా మండలం ఉలిక్కిపడింది. మండలంలో పోలీసులు సోదాలు నిర్వహించగా బుధవారం ఎక్కడ చూసినా అదే చర్చ కొనసాగింది. దేశవ్యాప్తంగా సైబర్ క్రైం మోసాల్లో నిందితుల్లో ముగ్గురు మండలానికి చెందినవారిగా ఉన్నారని తేలడంతో మండలవాసులు భయాందోళనకు గురయ్యారు.

నాయక్‌పోడ్ కుల సంఘం మండల కమిటీ ఎన్నిక

భీమారం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నాయక్‌పోడ్ కుల సంఘం మండల కమిటీని బుధవారం భీమారంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రొడ్డ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పూజారి కృష్ణమూర్తి, కోశాధికారిగా మంచాల కృష్ణమూర్తిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, వెంకటేశ్వర్లు, రాజన్న, సురేందర్, లచ్చన్న పాల్గొన్నారు.

టీబీపై అవగాహన

మందమర్రిరూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిమడుగు గ్రామంలో బుధవారం టీబీ వ్యాధిపై గ్రామస్థులకు ప్రభుత్వ వైద్యుడు రమేష్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ రెండు వారాలకు పైగా దగ్గు తగ్గకపోతే టీబీ వ్యాధిగా అనుమానించి ఆసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం టీబీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు చేపట్టాలి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

బెల్లంపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు టీడీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని పలు వార్డులకు సాగునీటి సరఫరా కావడం లేదని వర్షాకాలం సైతం తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పట్టణంలో ఎక్కడచూసినా చెత్తకుప్పలు దర్శనం ఇస్తున్నాయని దీంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. కుక్కల నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. డ్రైనేజీలు పరిశుభ్రంగా లేక సీజనల్ వ్యాధులు కబలిస్తున్నాయని వార్డుల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మణిరాంసింగ్, నాయకులు మల్లయ్య, గంగాధర్‌గౌడ్, తిరుపతి, రాజయ్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

మందమర్రిరూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో బుధవారం నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశల వారీగా ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుందన్నారు. వేగంగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సారంగపల్లిలో లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలను ఇవ్వాలని సీపీఐ ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

నస్పూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పట్టణంలోని సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉన్న వారికి ఇంటి పట్టాలను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో బుధవారం నస్పూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించింది. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సంతోష్ కుమార్ కు నాయకులు అందించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసులు మాట్లాడుతూ సింగరేణి స్థలాల్లో నివాసం ఉన్న స్థలాలను రెవెన్యూకు అప్పగించి జీవో నంబరు 76 ప్రకారం ఇళ్ల పట్టాలను ఇవ్వాలన్నారు. అలాగే సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న వారికి గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా జీవో నంబరు 76తో ఇంటి పట్టాలను ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను పూర్తిస్థాయిలో అమలు పర్చాలన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి లింగం రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు రేగుంట చంద్రశేఖర్, నాయకులు రామన్న, కిషన్ రావు, మహేష్, సురేష్, రాకేష్, రమేష్, అంజయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి


రాస్తారోకో చేస్తున్న మృతిరాలి కటుంబసభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు

మంచిర్యాలక్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం మిమ్స్ కళాశాల భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన కొత్తపల్లి సహస్ర కుటుంబ సభ్యులకు 50లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసును నమోదు చేయాలని మృతురాలి కుటుంబసభ్యులతో పాటు విద్యార్థి సంఘం నాయకులతో పాటు మంచిర్యాల ఐబీ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మృతురాలు సహస్ర తండ్రి రమేశ్ మాట్లాడుతూ కళాశాల భవనంలో కిటికీలకు సేఫ్టీ గ్రిల్స్ లేకపోవడం, కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే సహస్ర మరణించిందని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు శ్రీకాంత్, చిప్పకుర్తి శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థిని మృతికి కారకులైన యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు, కళాశాల యాజమాన్యం తమకు న్యాయం జరిగే విధంగా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతురాలి తండ్రి రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మంచిర్యాల కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని మిమ్స్ హాస్టల్ భవనంపై నుంచి పడి మృతిచెందిన విద్యార్థిని సహస్ర కుటుంబానికి న్యాయం చేయాలని జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి
లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి సాయికిరణ్

లక్షెట్టిపేట, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యం ఏర్పరుచుకుని దానికోసం శ్రద్ధగా చదవాలని లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్ కాసమల సూచించారు. బుధవారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ విద్యార్థికి చదువుకునే సమయం నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మహిళల కోసం విద్యార్థుల కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా విద్యార్థులు ఉన్నత లక్ష్యం ఎంచుకుని సాధన కోసం అహర్నిషలు కృషి చేయాలని సూచించారు. చదువుకు పేదరికం అడ్డు కాకూడదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రమాకళ్యాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్‌రావు, కిరణ్‌కుమార్, శివశంకర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మంచిర్యాల కలెక్టరేట్: ఈనెల 31న ఉద్యోగ విరమణ పొందుతున్న నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ మహాత్మా యశ్వంత్ రావును జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ సన్మానించారు.

హాజీపూర్: దొనబండ జడ్‌పీ హైస్కూల్ హెడ్‌మాస్టర్ దర్శకుర్తి హనమాండ్లు పదవీ విరమణ కార్యక్రమం బుధవారం దొనబండ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు.

మంచిర్యాల కలెక్టరేట్: మత్స్యగంధి మల్టీ స్టేట్ సొసైటీ బలపడాలని నాబార్డు జిల్లా అధికారి అబ్దుల్ రాహూఫ్ అన్నారు. బుధవారం మత్స్యగంధి స్టేట్ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీసీవో రవీందర్, డీఆర్‌పీ రాఘవేంద్రరావు, సంస్థ చైర్మన్ భీమన్న, తిరుపతి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించాలి
- డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

జైపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీష్‌రాజ్ సూచించారు. బుధవారం మండలంలోని ఇందారం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం, ఉప కేంద్రంను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాల్లో వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. రోజూ ఉప కేంద్రాల పరిధిలో ఓపీ సేవలు అందించాలని ఆదేశించారు. అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని, రోజువారీగా గ్రామాల్లో ఓపీ సేవలందించాలన్నారు. ఆశా కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ వైద్య సేవలందించడమే కాకుండా రిజిష్టర్‌లు, మందుల నిల్వలు, రోజువారీ ఓపీ రిజిష్టర్లు, శిశు సంరక్షణ నమోదు, టీకాల రిజిష్టర్లను నిర్వహించాలని సూచించారు. 102 అంబులెన్స్ ద్వారా గర్భిణులను తరలించి పరీక్షలు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కుందారం వైద్యాధికారి డాక్టర్ శ్రావ్య, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్, సూపర్‌వైజర్ జ్యోతి, కృష్ణవేణి, పద్మ, కార్యదర్శి సుమన్ తదితరులు పాల్గొన్నారు.


ఇందారంలోని ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

కాసిపేట: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది పటిష్ట చర్యలు చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ సూచించారు. బుధవారం ఆయన మండలంలో మామిడిగూటలో పర్యటించి స్థానికులు పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. మామిడిగూడెకు చెందిన ఆరేళ్ల బాలుడికి డెంగ్యూ లక్షణాలు బయటపడ్డాయి. ఆయన బాలుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి అధైర్యపడవద్దని డెంగ్యూ నివారణ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామాల్లో జ్వరపీడులను గుర్తించి వైద్య శిబిరాలను నిర్వహించాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కాసిపేట మెడికల్ ఆఫీసర్ శ్రీదివ్య, సిహెచ్‌వో వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు సరోజ, యశోధ, ల్యాబ్ టెక్నిషియన్ గోపి, హెల్త్ అసిస్టెంట్ నారాయణ, ఏఎన్ఎం జ్యోతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

జన్నారం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. భూభారతి దరఖాస్తులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని రాఘవేంద్ర రైస్‌మిల్లులో తనిఖీలు నిర్వహించారు. అనంతరం స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు అధికారులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



● నీటితో కళకళలాడుతున్న చింతకుంట చెరువు




● 10 రోజుల క్రితం నీరులేని చింతకుంట చెరువు

చెరువులు నిండే.. రైతులు మురిసే..

ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. మండలంలోని రెబ్బనపల్లి శివారులో ప్రధాన రహదారి పక్కన గల చింత కుంట చెరువు 10 రోజుల క్రితం వరకు నీరులేక వెలవెల బోయింది. ఇటీవల కురిసిన వర్షాలతో చెరువు నిండి జలకళను సంతరించుకుంది. దీంతో రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. చెరువు ఆయకట్టు కింద ఉన్న రైతులు వరి పంటలు సాగు చేసేందుకు సిద్ధం అవుతున్నారు.

\- దండేపల్లి (ఆంధ్రజ్యోతి)





పచ్చని ఒడి.. సత్య దేవుడి గుడి

ప్రకృతి రమణీయత ఓ వైపు.. పచ్చని చెట్లు మరోవైపు.. చూడగానే మనసుకు ఎంతో హాయినిస్తున్నాయి.. దండేపల్లి మండలం గూడెంలోని దేవాలయాలు. సత్యదేవుడి దర్శనం కోసం వస్తున్న భక్తులను ఆలయాల చుట్టూ ఉన్న పచ్చటి అందాలు కట్టిపడేస్తున్నాయి. గోదావరి తీరంలోని ఎత్తైన గుట్టలపై సత్యనారాయణస్వామి దేవాలయం, దాని పక్కనే మరో కొండపై వెలసిన అయ్యప్పస్వామి ఆలయం ప్రకృతి అందాలను చాటుతున్నాయి. జాతీయ రహదారి పక్కనే చెట్ల నీడల్లో సాయిబాబా దేవాలయం ఉంది. శావణ మాసంలో స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులు గూడెం గుట్ట పచ్చని అందాలను తనవితీరా తిలకిస్తూ మురిసిపోతున్నారు.

\- దండేపల్లి (ఆంధ్రజ్యోతి)

తగ్గిన మిర్చి సాగు

● గిట్టుబాటు ధర రాకపోవడమే కారణం

● ప్రత్యామ్నాయ పంటలపై రైతుల ఆసక్తి

6

చదివిన డిగ్రీ ఒకటి..వైద్యం మరొకటి

● జిల్లాలో విచ్చలవిడిగా వైద్య సేవలు

● ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేటు వైద్యులు

● అడ్డగోలుగా ఆసుపత్రులకు అనుమతులు జారీ

● అనర్హులపై టీఎంసీ కొరడా



మంచిర్యాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైద్యం విచ్చలవిడిగా మారింది. అర్హతలు లేకున్నా వైద్య చికిత్సలు చేయడం ఇక్కడ పరిపాటిగా మారింది. తెలిసీ తెలియని వైద్యంచేస్తూ స్థానిక డాక్టర్లు రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం అనుమానాలకు దారి తీస్తోంది. ఎంబీబీఎస్ అర్హతతో ఏకంగా మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు నడిపేవారు కొందరైతే...తాను చదువుకున్న డిగ్రీని కాదని, మరో విభాగంలో చికిత్స అందిస్తున్న వారు మరికొందరు ఉన్నారు.

● విచ్చలవిడిగా అనుమతులు...

రాష్ట్రంలో వైద్య విద్యలో ఎంబీబీఎస్‌తోపాటు ప్రత్యేక విభాగాల్లో పీజీచేసిన వారికి ఆసుపత్రులు ఏర్పాటు చేసుకునేందుకు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీజీఎంసీ) రిజిస్ట్రేషన్ తప్పనిసరి. ఆ ధ్రువీకరణ పత్రం ఉంటేనే వైద్య ఆరోగ్యశాఖ అనుమతులు ఇవ్వాలనే నిబంధన ఉంది. అంతే గాకుండా ప్రతిఐదేళ్లకు ఒకసారి రిజిస్ట్రేషన్ అనుమతులను రెన్యూవల్ కూడా చేసుకోవలసి ఉంటుంది. అయితే ఇవేమీ పట్టని జిల్లా వైద్యఆరోగ్యశాఖ ప్రైవేటు ఆసుపత్రులకు విచ్చలవిడిగా అనుమతులు మంజూరు చేస్తోందన్న అపవాదు ఉంది. అర్హత సర్టిఫికేట్లను పూర్తిగా పరిశీలించకుండానే అనుమతులు మంజూరు కావడంతో కొందరు వైద్యులది ఆడిందేఆటగా తయారైంది. ఇదే తరహాలో జిల్లా కేంద్రంలోని ఐబీ సమీపంలోగల ఓ ప్రముఖ వైద్యుడు నడుపుతున్న ఆసుపత్రికి వైద్య ఆరోగ్యశాఖ అనుమతులు జారీ చేసింది. అదికూడా సదరు వైద్యుడు చేసిన డిగ్రీ ఒకటైతే... మరో విభాగంలో చికిత్సకు అనుమతులు జారీ చేయడం కొసమెరుపు. ఆసుపత్రుల కేటాగిరీని బట్టి వివిధ రకాల ధరలు నిర్ణయించి, నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. స్కానింగ్ సెంటర్లకు అనుమతులు జారీ చేసేందుకు వేల రూపాయలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే ఐబీ సమీపంలోగల అర్హతలేని వైద్యుడికి కూడా అనుమతులు మంజూరైనట్లు తెలుస్తోంది.

● నోటీసు జారీతో వెలుగులోకి...

జిల్లాలో ఎలాంటి అర్హతలు లేకుండా మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు నిర్వహిస్తున్న వారిపై టీజీఎంసీ కొరడా ఝుళిపిస్తోంది. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తూ సదరు నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తోంది. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని ఐబీ సమీపంలో నిర్వహిస్తున్న ఓ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికీ నోటీసులు జారీ చేసింది. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తి 24-04-2025న ఐబీ ప్రాంతంలోని సర్జికల్, లాపరోస్కోపిక్, మెటర్నిటీ, కిడ్నీ సెంటర్‌ను ఆశ్రయించారు. అతన్ని పరీక్షించిన ఆసుపత్రి వైద్యుడు (జనరల్‌సర్జన్) బాధితవ్యక్తికి కిడ్నీచికిత్స అందించారు. వైద్యం బెడిసికొట్టడంతో బాధితుడు తీవ్ర నొప్పితో బాధపడుతూ మరోచోట చికిత్స తీసుకున్నారు. సదరు వైద్యుడు.. - మిగతా 7లో

ఏటీసీలో అడ్మిషన్‌లు పొందాలి

మందమర్రిరూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మందమర్రి మండలంలో ఏర్పాటు చేసిన ఏటీసీలో అడ్మిషన్లు పొందాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ దేవానంద్, ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏటీసీ పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం టాటా కన్సల్‌టెన్సీ సమన్వయంతో విద్యార్థులకు ఏటీసీలో కోర్సులను ప్రవేశపెట్టిందన్నారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐఐఐటీకి ఎంపికైన విద్యార్థి



ప్రసన్న కుమార్

నస్పూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పట్టణం తీగల్ పహాడ్ జిల్లా పరిషత్ పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన గోనె ప్రసన్న కుమార్ మహబూబ్‌నగర్ బ్రాంచ్‌లో ఐఐఐటీకి ఎంపికయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వామన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సీటు సాధించిన సందర్భంగా ప్రసన్న కుమార్‌కు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పదివేల రూపాయలను బహుమతిగా అందించి అభినందించారు.

మంచిర్యాలలో వందేభారత్, కేరళ ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ ఇవ్వాలి

మందమర్రిటౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో వందేభారత్, కేరళ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం పార్లమెంట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలోని రైల్వేస్టేషన్లలో మంచిర్యాల కూడా ఉందన్నారు. అధిక శాతం ఇక్కడ నుంచి కార్మికులు, వ్యాపారులు వరంగల్, హైద్రాబాద్, నాగ్‌పూర్, బల్లార్షా తదితర ప్రాంతాలకు వెళ్తారని తెలిపారు. రైల్వేకు మంచిర్యాల స్టేషన్ నుంచి అధిక మొత్తంలో ఆదాయం వస్తోందన్నారు. కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా మంచిర్యాలలో ఈ రెండు రైళ్లకు హాల్టింగ్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వందే భారత్, కేరళ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వాలని కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

భీమిని, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరుగనున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ శ్రేణులు సత్తా చాటాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందని వాటిని గ్రామాల్లో ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొంక సత్యనారాయణ, మండల ప్రబారి వైద్య శ్రీధర్, ప్రధానకార్యదర్శి ఇప్పకాయల వెంకటేష్, ఉపాధ్యక్షుడు పోతురాజుల శంకర్, పురుషోత్తంగౌడ్, నరేష్ గౌడ్, పొట్లపల్లి శేఖర్, కోట మల్లేష్, రజిత కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమారం: మండలంలో బీజేపీ పార్టీని బలోపేతం చేయాలని మండల బీజేపీ అధ్యక్షుడు బోర్లకుంట శంకర్ పేర్కొన్నారు. బుధవారం భీమారంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, శ్రీనివాస్, రాజేష్‌యాదవ్, మల్లేష్, దుశాంత్, సమ్మయ్యగౌడ్, జనార్ధన్, సురేష్, సుధాకర్, విజయ, జనార్ధన్, కుమార్‌యాదవ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



భీమినిలో మాట్లాడుతున్న కొయ్యల ఏమాజీ

'జన సురక్ష' పై అవగాహన

హాజీపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట రైతు వేదికలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం జన సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యుబీఐ రీజనల్ మేనేజర్ అపర్ణ రెడ్డి మాట్లాడుతూ సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి పథకాలకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యుల ఆర్థిక అభివృద్ధికి గాను రూ. 1.50కోట్ల విలువ గల చెక్కును అందజేశారు. యుబీఐ ఖాతాదారుడి నామినీకి జీవన్‌జ్యోతి బీమా పరిహారం కింద రూ. రెండు లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి, యుబీఐ నోడల్ అధికారి అభిమన్యు, డీఆర్‌డీవో పీడీ కిషన్, ఏవో క్రిష్ణ, హాజీపూర్ యుబీఐ మేనేజర్ సతీష్ పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు, పోడు రైతులు

తాండూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే పోడు భూముల రైతులకు పట్టాలు ఇవ్వాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి, మండల అధ్యక్షుడు దూడపాక భరత్ డిమాండ్ చేశారు. బుధవారం మండల తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పెగడపల్లి గ్రామంలోని నిరుపేద రైతులు పది సంవత్సరాలుగా భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. పోడు రైతులకు పట్టాలు ఇస్తామని ప్రభుత్వం చెప్పినప్పటి వరకు ఇవ్వలేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా సీనియర్ నాయకుడు రామగౌని మహీధర్‌గౌడ్, నాయకులు కుమార్,చరణ్, ప్రదీప్, శంకర్, పోడు రైతులు పాల్గొన్నారు.

13వ బెటాలియన్‌లో వన మహోత్సవం



మొక్క నాటుతున్న కమాండెంట్ రాములు

హాజీపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట 13వ ప్రత్యేక పోలీసు బెటాలియన్‌లో బుధవారం వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కమాండెంట్ వెంకట్‌రాములు ఆధ్వర్యంలో విస్తృతంగా మొక్కలు నాటి నీరు పోశారు. అందరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. తమ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటేలా చూస్తూ వాటి సంరక్షణ చేపట్టేలా స్ఫూర్తి నింపాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్ రావు, కాళీదాసు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, బెటాలియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహ సంక్షేమాధికారుల సమస్యలను పరిష్కరించాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహ సంక్షేమాధికారుల సమస్యలను పరిష్కరించాలని వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోసిన్ పేర్కొన్నారు. బుధవారం మంచిర్యాలలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయి సమస్యలను పరిష్కరించాలని అధికారులను కలిసి వినతి పత్రాలు ఇస్తామన్నారు.

జిల్లా స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా నియామక మైన వసతి గృహ సంక్షేమాధికారులను సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి కోరుట్ల శ్రీనివాస్, సరిత, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల శ్రేయస్సుకు ప్రభుత్వం పెద్దపీట

- కలెక్టర్ కుమార్ దీపక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తూ అన్నిరంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తోందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టర్ సమావేశ మందిరంలో మహిళ సమాఖ్య సభ్యులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఇందిరా మహిళ శక్తి సంబరాలు జిల్లాలో విజయవంతం అయ్యాయని తెలిపారు. ప్రభుత్వం మహిళ సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనుల్లో జిల్లా మహిళ సమాఖ్య సభ్యులను భాగస్వాములను చేసి వచ్చిన నిధుల్లో మూడు శాతం కమీషన్ ఇస్తున్నామన్నారు. మునగ సాగుపై ఆసక్తి ఉన్న మహిళలు తమ సొంత భూమిలో పత్తితో పాటు అంతర పంటగా సాగు చేసుకోవచ్చని, తద్వారా ఎకరానికి లక్ష రూపాయల వరకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. మహిళ సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నిర్వహించేందుకు మందమర్రి మండలానికి మంజూరు చేశామని తెలిపారు. అనువైన స్థలాన్ని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజీవ్ యువవికాసం పథకంలో వాహనం తీసుకుని ఆసక్తి గల మహిళలు డ్రైవింగ్ శిక్షణ పొందాలని సూచించారు. మంచిర్యాల పట్టణంలోని పోలీస్‌స్టేషన్ పక్కన గల జిల్లా సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళ శక్తి బజార్‌గా మార్చి మహిళలు తయారు చేసే అన్ని రకాల ఉత్పత్తులను విక్రయించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో కిషన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాయంలో డీసీపీ భాస్కర్‌తో కలిసి పోలీసు, రవాణా, ఆర్టీసీ, రహదారుల సంస్థ, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రహదారులపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ ఏర్పాటు చేసే అధికారులు రహదారులు, పైపులైన్‌లు దెబ్బతినకుండా పనులను చేయాలన్నారు. రహదారులపై పశువుల వల్ల జరిగే ప్రమాదాలను నివారించేందుకు పశువు లను చెన్నూరులోని గోశాలకు తరలించాలని, మంచిర్యాలలో గోశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ రెండోసారి పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయాలన్నారు. ఈ సంవత్సరం జిల్లాలో 47 లైసెన్స్‌లను రద్దు చేశామన్నారు. మూల మలుపులు, వేగ నిరోధకాలు, వేగ పరిమితి, యూ టర్న్ ఇతర సూచికలను ఏర్పాటు చేసి వాహనదారుల రక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని జన్నారం, శ్రీరాంపూర్‌లో బస్సులు రోడ్లపై నిలుపడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, బస్టాండ్ లోపలికి వెళ్లి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్లు, రవికుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి సంతోష్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.